

**మనకు విలువలు లేకపోయినా**
**భాషకు విలువలు లేకపోయినా**
**జాతికి దుర్గతి తప్పదు !**

**భాష విలువలు కాపాడటానికి నిర్దిష్టమయిన నియమావళి, కట్టుదిట్టమయిన యంత్రాంగం అవసరం. అచ్చ తెలుగు మాట్లాడటానికి ప్రజలు పండితులు కానక్కరలేదు. విద్యావంతులు కానక్కరలేదు. గొప్పగొప్ప గ్రంథాలు చదవనక్కరలేదు. మనిషి పుట్టినప్పటి నుంచి పెరిగే కొద్దీ మాతృభాషలోని మెళకువలను తనకు తెలియకుండానే నేర్చుకుంటాడు.**

# 3 గిడుగు రామమూర్తి పంతులు

© SCERT not to be republished

కొందరు పుడుతూనే గొప్పవారుగా పుడతారు. కొందరు స్వయంశక్తిచేత, స్వయంకృషిచేత జీవితంలో గొప్పతనం సాధిస్తారు. మరికొందరికి పరిస్థితుల ప్రాబల్యం గొప్పతనాన్ని ఆపాదించి పెడుతుంది. మహాపురుషుల జీవితాలు తరవాతి తరాలమీద కూడా ప్రభావాన్ని చూపుతాయి.

గిడుగువారి నివాసస్థలం తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురానికి మైలు దూరంలో ఉన్న ఇందుపల్లి గ్రామం. 1830లో కోనసీమలో అనావృష్టివల్ల కరువుకాటకాలు సంభవించాయి. ఈ ప్రాంతం నుంచి ఎన్నో కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళాయి. అలా రామమూర్తిగారితండ్రి వీర్రాజుగారు కూడా ఉద్యోగం కోసం విజయనగరం వలస వెళ్ళారు. ఈ విధంగా గిడుగువంశంవారు విజయనగరం వాస్తవ్యులయ్యారు.

## బాల్యం- విద్యాభ్యాసం

గిడుగు వీర్రాజు, వెంకమాంబ పుణ్యదంపతులకు 29.8.1863న రామమూర్తిగారు జన్మించారు. పర్వతాల పేటలో రామమూర్తిగారి అక్షరాభ్యాసం, పాఠశాల విద్యసాగింది. కీర్తిశేషులు వారణాసి గున్నయ్య శాస్త్రిగారు వీరికి రాయడం, చదవడం నేర్పించారు. గిడుగు వీర్రాజుగారు తీరిక సమయాల్లో భారతం, భాగవతంలోని పద్యాలు, బాలరామాయణంలోని కొన్ని శ్లోకాలు చదివించేవారు. మెట్రిక్యులేషన్ పాసై పర్లాకిమిడి రాజాగారి మిడిల్‌స్కూల్‌లో మొదట ఫస్ట్‌ఫారం టీచరుగా చేరారు.

## ఉద్యోగం - వివాహం

ఎఫ్.ఎ.పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాక ఆ వెంటనే హైస్కూలు టీచరుగా మారారు. కందికొండ రామదాసు

పంతులుగారి కుమార్తె అన్నపూర్ణతో తన 16వ ఏట 1879లో రామమూర్తిగారి వివాహం జరిగింది. 1885లో రామమూర్తిగారికి పుత్రుడు జన్మించాడు. ఆయన పేరు వెంకటసీతాపతి. రామమూర్తిగారికి ఆశ, తొందరమెండు, తనకు వచ్చిన చదువంతా ఒక్కసారే విద్యార్థికి చెప్పాలన్న తాపత్రయం. చెప్పిన విషయాలు వెంటనే గ్రహించకపోతే విపరీతమైన కోపం. అందుకే 'అన్నప్రాశన నాడే ఆవకాయ పెడతాడీ రామమూర్తి' అనే వారట సహాధ్యాయులు.

**కుటుంబ జీవితం**

రామమూర్తిగారి ఇల్లాలు అన్నపూర్ణమ్మగారు పెద్దగా చదువుకోలేదు. భర్త చదువుమీద శ్రద్ధచూపుతుంటే ఇంటిని నిర్వహించే బాధ్యతంతా ఆమె మీదనే వేసుకొని రామమూర్తిగారికి దీక్షగా చదువుసాగే వాతావరణానికి వేదికను కల్పించారు. రామమూర్తిగారు తమ తండ్రివలె మంచి సాహసి. జీవితంలో వచ్చే మార్పులను వెరవకుండా ఆహ్వానించగల తత్త్వం. అప్పట్లో రైలు మార్గాలు లేవు. రెండు మూడు కుటుంబాలు కలిసి ఎడ్లబండి కట్టించుకుని ప్రయాణించేవారు. చెళ్ళపిళ్ళవేంకటశాస్త్రిగారు కడియం నుంచి ఎడ్లబండిలో వచ్చి రామమూర్తిగారిని పలకరించి వెళ్ళేవారు.

గిడుగుగారి స్నేహితులంతా ఒక ఎత్తు. ఆప్తమిత్రుడూ, ఆత్మీయుడూ అయిన గురజాడ అప్పారావు ఒక ఎత్తు. రెండు వేర్వేరు గ్రామాల నుంచి వచ్చిన ఇద్దరు "జీ.వీ." (గిడుగు వేంకటరామమూర్తి, గురజాడ వేంకట అప్పారావు)లు ఒకే ఏడాది ఒకే బడిలో చదవడం గొప్ప సంఘటన. ఇద్దరి మనస్తత్త్వాలు ఒకటే.

శ్రీ గురజాడ అప్పారావు 1880లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. అప్పుడప్పుడే కవిత్వం రాయడం ప్రారంభించాడు.

అప్పారావుగారి తొలికథ 'దిద్దుబాటు' అద్వితీయమైన కథ. 1910లో 'ఆంధ్రభారతి' మాస పత్రికలో తొలిసారిగా అచ్చయినపుడు రసికాంధ్ర లోకం పరవశంతో ఊగిపోయింది. ఆయన రచనల్లో కన్యాశుల్కం, కొండు భట్టీయం, బిల్హణీయం నాటకాలు ఎంతోకీర్తిని సంపాదించి పెట్టాయి.

అప్పారావుగారి మార్గం నవీనం. ప్రతిభ అనన్యం. అనుభవం అపారం. భాష సజీవం. భావాలు సంచలనం. అందుకే మహాకవి శ్రీశ్రీ "ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మహాకవులు"--అన్నారు. గురజాడ రాసిన గేయాలన్నీ ఇరవైకి తక్కువే. అవే ఆయన్ని మహాకవిని చేశాయి.

గురజాడవారి "ముత్యాలసరాలు" ప్రభావం అనంతర కవుల మీద ప్రసరించింది.

**సవరల అభివృద్ధికై కృషి**

రామమూర్తిగారు 1936 వరకు పర్లాకిమిడిలోనే స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. అక్కడ కొండ ప్రాంతంలో నివసించే సవరలు విద్యాగంధం లేక ఉన్నారు. వీరికోసం బడులు పెట్టించి చదువు చెప్పించాలనే కోరిక రామమూర్తిగారికి కలిగింది. ఇందుకోసం 1892లో సవరభాష నేర్చుకోవడం ప్రారంభించారు. ఒక సభలో సవరల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వంవారు సవరదేశంలో పాఠశాలలు ఏర్పాటుచేయాలని, అందుకు రామమూర్తిగారు సహాయపడగలరని 1894లో గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ అంగీకరించారు. కాని, ఆనాడు జిల్లా కలెక్టరుగా ఉన్న మెక్కార్టే దొరగారికి, సవరలకు చదువు చెప్పడం ఇష్టంలేదు. అందుచేత రామమూర్తి పంతులుగారు చేసిన ప్రయత్నం అప్పటికి నెరవేరలేదు.

సవరభాషా సవరపాటలూ నేర్చుకుందామని కొండాకోనల్లో తిరగడంతో రామమూర్తి పంతులుగార్కి మలేరియా జ్వరం వచ్చింది. 'క్వినయన్' అనే మందును 40 రోజులు సేవించడంవల్ల చెవుడు వచ్చింది. ఇది తగ్గడానికి ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకపోయింది. వీరి చారిత్రక పరిశోధనాకృషి మాత్రం కొంతవరకు ఫలించింది. సవరభాషపై కృషిచేసి తెలుగు- సవర నిఘంటువును రచించారు. సవరపాటలూ సవరకథలూ కొన్ని సవరభాషలోనే రాసి పెట్టుకొన్నారు. సవరభాషకు వ్యాకరణం రచించడానికి కృషిచేశారు. ఇందుకు మామిడల్లం కుమారస్వామి పంతులుగారు సహకరించారు. రామమూర్తిపంతులుగారికి 'తాడు' అనే పేరుగల పైడి(పానో) వాడు సవరభాష నేర్చాడు. రామమూర్తి పంతులుగారు సొంతధనం వెచ్చించి, సవరల కోసం బడులు పెట్టించాడు. 30 సంవత్సరాలు నిర్విరామంగా విద్యాబోధన చేసిన రామ్మూర్తి పంతులుగార్కి 1913లో 'రావుసాహెబ్' బిరుదును బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చింది. 1934లో కైజర్-ఇ- హింది సువర్ణపతకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం రామమూర్తిగారికి బహుమతిగా ఇచ్చింది.

### నిఘంటువు- వ్యాకరణం రచన

గ్రాంథిక భాషావాదులు వ్యవహారికభాషావాదులకు వ్యతిరేకంగా కాకినాడలో ఆంధ్రసాహిత్య పరిషత్తు స్థాపించారు. దీనిద్వారా సాహిత్యపరిషత్తు పత్రిక అనే మాసపత్రికను ప్రచురింపసాగారు. సూర్యరాయాంధ్ర నిఘంటువును తయారుచేశారు.

గ్రాంథిక భాషావాదులకు పోటీగా వ్యవహారిక భాషావాదులు కూడా ఒక పత్రిక నడపడం, నవ్యాంధ్ర వ్యాకరణం రాయించడం, వ్యవహారంలో పదాల అర్థచ్ఛాయలన్నింటిని సప్రయోగంగా వివరిస్తూ వ్యుత్పత్తిని, అర్థవిపరిణామాన్ని సూచిస్తూ ఒక నిఘంటువు తయారుచేయలనుకున్నారు. దానికై రామమూర్తిగారు స్వీకరించిన సమాచారం వీరేశలింగంపంతులుగారికి ఇచ్చారు. కొన్ని నెలలకే ఆయన స్వర్గస్థులవడంతో ఆ వ్యాకరణం వెలుగుచూడలేదు. గ్రాంథిక భాషావాదులకున్న అంగబలం, అర్థబలం వ్యవహారిక భాషావాదులకు లేకపోవడంవల్ల రామమూర్తి పంతులుగారు పర్లాకిమిడిలో ఆరంభించిన 'తెలుగుపత్రిక' ఏడాదికంటే ఎక్కువ నడవలేదు.

### వ్యావహారిక భాషోద్యమం

గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమం విస్తృత ఫలితాలను సాధించింది. విద్యాలయాల్లో ప్రాచీన తెలుగుకావ్యాలను బోధించే బోధనాభాషగా ప్రాచీన కావ్యభాషను కాక ఆనాడు పండితుల వ్యవహారంలో ఉన్న శిష్ట వ్యావహారిక భాషను వాడుక చేయాలని, విద్యార్థులకు శిష్టవ్యావహారికంలో రాసే అవకాశం ఉండాలని మాత్రమే ఆదిలో వ్యావహారిక భాషోద్యమం ప్రతిపాదించింది. 'జీవద్భాషకు నియామకుడు రచయితే కాని లాక్షణికుడూ, వ్యాకరణ కర్తాకాదు' అని రామమూర్తిపంతులుగారు స్పష్టంచేశారు.

### ప్రధానలక్ష్యం

1907 నుండి 1910వరకు జరిగిన వార్షిక సమావేశాల్లో రామమూర్తి పంతులుగారు జీవద్భాష ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, పాఠశాలల్లో విద్యార్థులకు బోధనాభాషగా శిష్ట వ్యావహారికమే ఎందుకు ఉండాలో అనేక ఉపపత్తులతో నిరూపిస్తూ ప్రసంగించేవారు.

© SCERT not to be republished

1905 నివేదిక దేశంలో అక్షరాస్యులు 10శాతమేనని కనుక విద్యావిధానాలలో పెద్దమార్పులు అవసరమని సూచించింది. అందుచేత ప్రభుత్వం 1910లో కొన్ని మార్పులు తెచ్చింది. స్కూల్ ఫైనల్ పరీక్షకు నిర్ణయించిన అనువాదాంశానికి, వ్యాసరచనకు వినియోగించే భాష గ్రాంథికమైనా, వ్యావహారికమైనా కావచ్చునని విద్యార్థులు ఇష్టానికి విడిచిపెట్టారు.

10.3.1933 నుండి 3 రోజులపాటు అభినవాంధ్రకవి పండిత సభ జరిగింది. ఆధునిక వ్యావహారికమే బోధనాభాషగా ఉండాలని తీర్మానించింది. వ్యావహారికభాషను ప్రతిష్ఠించడంలో విశ్వవిద్యాలయాలూ, ప్రభుత్వం వెనుకంజ వేసినా పత్రికలు మాత్రం రామమూర్తిగారి వాదానికి పూర్తి సహకారం ఇచ్చాయి.

విశ్వవిద్యాలయాలు వాడుకభాషను ఆమోదించడం ఆలస్యమయినా పత్రికలు, రేడియోలు, సినిమాలు వ్యావహారిక భాషను ఆమోదించాయి. రామమూర్తిపంతులుగారి చేత ఉత్తేజితులైన పలువురు రచయితలు వాడుక భాషలో గ్రంథాలు రచించి సాహిత్యభాషగా, కవిత్వభాషగా వ్యావహారిక భాషే మరింత గొప్పదని రుజువు చేశారు కూడా.

"ప్రజల్లో విద్య వ్యాపిస్తేగాని సంఘం వృద్ధిలోకి రాదు" అని 1940 జనవరి 15న గూడవల్లి రామబ్రహ్మంగారు తమ సందేశంలో పేర్కొన్నారు.

1969లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అకాడమీని స్థాపించింది. పాఠ్యపుస్తకాలు వ్యావహారిక భాషలో ప్రచురిస్తున్నారు. 1969లోనే పి.హెచ్.డి. చేసే విద్యార్థులు తమ పరిశోధనా వ్యాసాలను వ్యావహారికంలో రాయడానికి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అనుమతించింది. 1973లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా ఆమోదించింది. 1911లో రామమూర్తి పంతులుగారు ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమం 1973 నాటికి విజయవంతమయ్యింది. అంటే వ్యావహారిక భాషోద్యమం 62 ఏళ్ళు సాగింది.

**బహుముఖ ప్రజ్ఞాశాలి**

గిడుగు రామమూర్తిగారిది మహోన్నత వ్యక్తిత్వం. ఆయనకు నిరుపమానమైన మానవతాదృష్టి ఉంది. చైతన్యపూరిత ఘట్టాలతో కూడిన ఆయన చరిత్ర భావితరాలకు మార్గదర్శనం అవుతుంది. డేనియల్ జోన్స్ వంటి బ్రిటిష్ ధ్వనిశాస్త్రవేత్తలతో చర్చలు ఒట్టోజెన్‌పర్సన్ వంటి వ్యాసకర్తలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన అంతర్జాతీయ భాషాశాస్త్రవేత్త, కావ్యభాషా పరిశోధకులు, స్టెన్‌కోనో, హుల్ష్‌లు నిర్మించిన 'ఎపిగ్రాఫియా ఇండికా' సంపుటాల్లోను, స్వీకరించబడిన నిర్ణయాలు ప్రకటించిన శాసన పరిశోధకులు. థర్‌స్టన్ రచించిన సంపుటాల్లో సవరజాతికి చెందిన అంశాలకు పరిశోధక రచనలుచేసిన శాస్త్రవేత్త.

1930లో సవరభాషకు వర్ణనాత్మక వ్యాకరణం రచించారు. ఇది అంతర్జాతీయ ధ్వని లిపితో రాయబడిన మొదటి వ్యాకరణం అని ప్రొఫెసర్ డేవిడ్‌స్టాంపే పేర్కొన్నారు. రామమూర్తి పంతులుగారు చేబట్టిన అన్ని కార్యక్రమాలకు మహనీయమైన మానవతాదృష్టే మూలం. 1913లో గిడుగువారు ప్రకటించిన A memorandam on Modern Telugu అనే ఆంగ్లరచన ద్వారా అప్పటి భాషా స్థితిపైన, విద్యావిధానంపైన వారి దృక్పథం తేటతెల్లమవుతుంది. పాఠశాల పుస్తకాల్లోనే కాకుండా ప్రభుత్వం ప్రజలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాల్లో కూడా వాడుకభాషే వాడాలని సూచించారు. తెలుగుభాషా బోధన విద్యార్థులందరికీ నిర్బంధంగా ఉండాలని, తెలుగులోనే శాస్త్రవిజ్ఞానం అభ్యసించాలని తద్వారానే ఆధునికభాషాభివృద్ధి చెందుతుందని రామమూర్తి పంతులుగారు

విశదీకరించారు.

**ప్రతిభాశాలి**

గిడుగు రామమూర్తి పంతులుగారు గొప్ప భాషా శాస్త్రవేత్త, పరిశోధకుడు, గ్రంథ పరిష్కర్త, శాసనపరిష్కర్త, పత్రికా రచయిత, విద్యావేత్త, ప్రజాస్వామికవాది, మానవతావాది. భాషాబోధన గురించే కాకుండా శాస్త్ర విషయాల బోధన గురించి కూడా గిడుగువారు విద్యాశాఖాధికారిగా ఉన్న జె.ఏ.ఏట్సుతో చర్చించేవారు. వీరిద్దరూ కలిసి 'ది టీచర్' పత్రిక స్థాపించారు. పంతులుగారు నడుస్తున్నా, కూర్చున్నా, మిత్రులు కలిసినా తెలుగుభాష గురించే ఆలోచిస్తూ ఉండేవారు. సందర్భం ఏదైనా ఆయన మాటల్లో తెలుగుభాష ప్రస్తావన తప్పక రావలసిందే.

ఆయన దత్తపుత్రిక శారదాంబగారు నవ్వుతూ 'గ్రాంథిక భాషను ఎవ్వరూ చదవకూడదంటారా?' అని రామమూర్తిగారితో అన్నారు. అప్పుడు రామమూర్తిగారు "నేను గ్రాంథికభాషకు వ్యతిరేకిని కాదు. తెలుగుభాషలో పాండిత్యం సంపాదించాలన్నా, భాషాస్వరూపం తెలుసుకోవాలన్నా, గ్రాంథిక భాషను తప్పకుండా అభ్యసించాలి. తెలుగుభాషకు ప్రాణవాయువు వంటిది సంస్కృతం, దాన్ని కూడా అభ్యసించడం అవసరం. ప్రజలకు ఉపయోగపడే గ్రంథాలను కృతకభాషలో రచించి భేషజాన్ని ప్రదర్శించవద్దంటాను". అన్నారు. రామమూర్తిగారి వ్యావహారిక భాషావాదాన్ని వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి పండితులు కూడా ఆమోదించారు.

ఇటువంటి మహనీయుల జీవితాలు ఎందరు వినిపించినా, రాసినా ఇంకా మిగిలే ఉంటాయి. వారు తను పుట్టిన గ్రామాన్ని మాతృసమానంగా ప్రేమించారు. 1940 జనవరి 22వ తేదీన గిడుగు రామమూర్తి పంతులుగారు కోటాను కోట్ల తెలుగు ప్రజల నుండి శాశ్వతంగా దూరమయ్యారు.

మనకు విలువలు లేకపోయినా, భాషకు విలువలు లేకపోయినా జాతికి దుర్గతి తప్పదు. భాష విలువలు కాపాడటానికి నిర్దిష్టమయిన నియమావళి, కట్టుదిట్టమయిన యంత్రాంగం అవసరం. అచ్చ తెలుగు మాట్లాడడానికి ప్రజలు పండితులు కానక్కరలేదు. విద్యావంతులు కానక్కరలేదు. గొప్పగొప్ప గ్రంథాలు చదవనక్కరలేదు. మనిషి పుట్టినప్పటి నుంచి పెరిగే కొద్దీ మాతృభాషలోని మెళకువలను తనకు తెలియకుండానే నేర్చుకుంటాడు. భాష సంస్కారపు పొలిమేరలు దాటకూడదు.

తెలుగునాట తెలుగువాడై పుట్టిన ప్రతిఒక్కరూ గిడుగురామమూర్తి పంతులుగారి ఆశయసాధనలో పయనించాలని ఆశిద్దాం.

© SCERT not to be republished

## ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత విశేషాలను సంక్షిప్తంగా రాయండి.
2. రామ్మూర్తి పంతులు గారి రచనల గురించి తెల్పండి.
3. పంతులు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి' అనే వాక్యాన్ని మీరెలా సమర్థిస్తారు.
4. వ్యావహారిక భాషావాదం వల్ల విద్యార్థులకు మేలు జరిగిందని మీరనుకుంటున్నారా? కారణాలు రాయండి.
5. గురజాడ అప్పారావు గురించి రాయండి.